# కొండగెద్ద

కనబడ్డాడా ఇంజనీరు నాలుగురోడ్లమధ్య, నలుగురితో. పంట సర్వనాశనమై మతి తగలబడి వున్నాను. పశువులకి గడ్డయినా కాలేదు. వ్యవసాయం మదుపంతా బుగ్గిపాలైంది. గొడ్డూ గోదల్తో మళ్ళా పంటదాకా కాలం గడపాలి. ఋణాలకి దరఖాస్తులు పెట్టుకొని కాళ్ళరిగేటట్లు తిరుగుతున్నాము. తక్కావీ ఋణాలు యిస్తామంటారు. దూతలు మా మొహాలు చూసి లంచాలు అడగలేరు. మేము ఇవ్వము. వాళ్ళు శాంక్షను చెయ్యరు.

అప్పుడే కనపడాలా ఇంజనీరు!

ఎవ్వడోకాదువాడు. చిన్ననాటినుంచీ నాతోపాటు చదువుకొన్నవాడు. నేను వ్యవసాయదారుణ్ణయి మడిచెక్కలు నాలుగు దున్నుకొంటున్నాను. హాయిగానే కాలక్షేపం చేస్తున్నాను. మన చదువు హైస్కూలు గడులు దాటిందికాదు. వాడు ఇంజనీరైనాడు. వాడి కారు ఎర్రగా కాస్తంతదూరంలో ధళ్ ధళ్ మెరిసిపోతున్నాది. నాకు అగ్నిహోత్రం రగిలిపోతున్నాది.

రగలదూ? ఎవరికి రగలదు?

మా భూములు అతి సారవంతమైనవి. మేము ఆకాశాన్ని నమ్మి విత్తనాలు బుగ్గిలో పోస్తాం. ఆకాశం బెజ్జాలుపడి గాలిలోంచి నీళ్ళ చుక్కలు నాలుగు జల్లులు రాలితే మా చెరువు నిండితే మా గాదులు నిండుతాయి.

"వానలు కురవ్వు
వరిచేలు పండవు
మా అమ్మ వండదు
మా పొట్ట నిండదు
బడుగో, బడుగో"

అని మా రైతు పిల్లలంతా గుడిసెల్లో పాడతారు. మా కెదురుగా మా భూములమీంచి పారే మహానదులు లేకపోయినా కొండ వాగులున్నాయి. వాట్లో వర్షాకాలమంతా నీళ్ళు పరుగులు తీస్తాయి. కొండ గెడ్డలోకిపోతే చెరుకు పానకంలాంటి నీళ్ళు రాళ్ళల్లో గలగల్లాడుతూ,

"మనుషులు రానీ మనుషులు పోనీ
నేను సదా నినదిస్తాను"

అని ఇంగ్లీషు కవితో ఏకీభవించి పాడతాయి. గెడ్డనిండా ఇసుక చాళ్ళలో తోకాడింపు పిట్టలు పరుగెడతాయి. పిగిలి పిట్టలు ఈలలేస్తాయి. ఆకాశంలో మేఘాలు లేస్తాయి. కొండంతా వర్షంతో నాని ముద్దవుతుంది. మా కొండవాగు ఉరకలువేస్తూ, నురగలు కక్కుతూ, గట్లు కూల్చేస్తూ, గడ్డిమెట్లు ఎత్తుకుపోతూ, కదను తొక్కుతుంది. మా వూరు కెదురుగా ఇంద్రధనుస్సులు పొడుస్తాయి. మా మెరకల్లో మంచుబిందువులైనా రాలవు.

మహజర్లు పెట్టేము. మంత్రులదాకా వెళ్లేం. అదృష్టవంతులమే. వేశారు ఇంజనీర్లని. చేస్తున్నారుపని. ముందు వారి ముఖాములకి బంగళాలు మాత్రం అతి శీఘ్రంగా వెలిశాయి. జీతాలు ముడుతున్నాయి. ముడుపులు చెల్లుతున్నాయి. మా పొలాల పగుళ్ళలో ఎలుకలు చస్తున్నాయి. చీపుళ్ళు పండుతున్నాయి. జిల్లేళ్ళు వికసిస్తున్నాయి.

గెడ్డరాళ్ళలో విరగబాటు ప్రయాణం చేస్తూ మమ్మల్ని చూసి నీళ్ళు నిత్యం పకాలున నవ్వుతున్నాయి. పెద్దలు వరుణజపం చెయ్యమంటున్నారు. నమ్మకస్తులు ఆకాశానికి చేతులెత్తుతున్నారు, అమావాశ్యనాటి రాత్రి చంద్రోదయం కోసం.

కనబడ్డాడా యింజనీరు. మన దేశపు భాగ్య విధాత అయిన మహా నిపుణుడు. చిన్ననాటి నా సచివోత్తముడు.

ఎలాగ్గా ప్రారంభించాను? వాణ్ణేమిటన్నాను? జ్ఞాపకం ఉన్నదంతా ముద్దకింద ఉంది. కుక్కలాగ మొరుగుతూ మీదికెళ్ళాను. జనం కిక్కురు మనలేదు. నా ఉపన్యాసమంతా చుట్టూ చక్రంకట్టి రెండువందలమంది పోగై చక్కగా విన్నారు. సమర్థతతో వివరించాను. వ్యక్తిత్వం అమోఘం. స్త్రైహాలాగ నాకు నత్తీ గిత్తీ రాలేదు. బూతులు బహుదొర్లేయి.

“తప్పు, తప్పు” అని ఎవరో సలహా యిచ్చేరు. నా బూతులని సమయస్ఫూర్తితోనే వ్యవహరించాను.

“ఇది శాసనసభ అనుకున్నావా? ఇది ప్రజారంగం” అన్నాను.

ఈ పంతులు తాగుతాడా అని నిర్ధారణగా ఒకడన్నాడు. నా చెవిని పడ్డాది, ఈనాటికీ జ్ఞాపకం ఉంది. అరిచే కుక్క కరవదని సామెత. ఊర కుక్కలాగ మొరిగాను. రేచుకుక్కలాగా మీద పడ్డాను. నేను తాగేననా, అంతా అనుకుంటున్నారు? నన్నావేశపరచింది సారా కాదు, సత్యం. సత్యంతో కూడుకున్న ఆగ్రహం. సత్యాగ్రహం.

నాకందింది వాడి నుదుటి మీది జుత్తు. ఆరేసి అంగుళాల ఉంగరాల వెంట్రుకలు. ఏ ఆడదయినా వెంటపడేటట్టు తీర్చిదిద్దుకున్న కురులు. మొహాన్ని నేలకేసి కొట్టాను. ముక్కు బ్రద్దలైంది. పట్టిలాగితే చెవి చిరిగి పోయింది. వెంట్రుకల కుదుళ్ళలోంచి రక్తం నుదుటి మీదకొచ్చింది. వాడి గగ్గోలు గాడిద గొంతుకతో వీధి వీధంతా విస్తరించింది. నా చెవుల నిండా ఓండ్ర పెట్టింది. తరవాత నాకు స్పృహలేదు.

చైతన్యం వచ్చి కళ్ళు తెరిచిచూస్తే కనబడ్డది డాక్టరుగారి మొహం. రాత్రనక పగలనక పిలవగానే మా ఊరు వచ్చి మమ్మల్నీ పిల్లల్నీ ఈనాటి దాకా కాసుకొస్తున్న చల్లనిచేతితో నా మొహమంతా తడువుతున్నాడు.

జరిగినదంతా స్వప్నంగా గోచరించలేదు. ఏమయితే కానీ అనే మొండి ధైర్యమే ఆవేశించింది పోలీసు జమానులున్నారు పక్కని.

నాకు జరిమానా మాత్రమే పడ్డాది. నిర్విచారంగా పారేశాను. విచారమెందుకూ? మేజిస్ట్రేటు నెత్తిమీద నిలబడి ఏమిరాస్తున్నదీ చూస్తూ న్నాడు-ఏమి తీర్పు చదివిందీ వింటున్నాడు గాంధీ మహాత్ముడు. నాకు తెలుసు నా శిక్ష శిక్ష కాదని. నాకు తెలుసు నాది సత్యాగ్రహమని.

శిక్ష పడ్డాదనే నా సంతోషం. పత్రికలన్నీ నా కేసు మొట్టమొదట నుంచీ ప్రకటించుకొచ్చాయి. నా పేరు దేశవ్యాప్తమయిందనికాదు నా సంతోషము; వాస్తవమైన విషయం వెల్లడి అయిందని.

నాకు జరిమానా పడవలసిందే. నలుగుర్లో నడిరోడ్డుమీద ముక్కు చితక్కొట్టితే చెవిని చింపేస్తే శిక్ష తప్పుతుందా?

కొట్టడం అన్యాయమే. తాత్కాలికావేశమే. కొట్టాను ఎందుకా?

ఇంజనీరు చిన్ననాటి స్నేహితుడు. మా కొండగడ్డకి ప్రోజెక్టుకట్టి
మమ్మల్ని ఉద్ధరించమని ప్రభుత్వము పంపింది. మావూరికి ఎనిమిదిమైళ్ళ
దూరంలో ఆయన మకాం. నడిచి నాబందో అని స్నేహితుణ్ణి చూడ
డానికి వెళ్ళాను. మా ప్రోజెక్టు బ్లూ ప్రింటు ఎంతచక్కగా వుంది!
కంట్రాక్టర్లు వచ్చారు. ఇంజనీర్లు అజమాయిషీ చేస్తున్నారు. విడిదెలు కట్టు
కొని విహరిస్తున్నారు. ఏ లోపంలేదు. తెచ్చిపడేస్తున్నారు కంట్రాక్టర్లు.
వచ్చే లారీ పోయేలారీ వచ్చేకారూ పోయేకారూ. మహా కోలాహలంగా
ఉంది.

నా స్నేహితుడు నామీద కల్మషంలేని అభిమానంతో ఉన్నాడు.
స్నేహితునికి చేసిన సత్కారం చిన్నదికాదు. ఆ మధ్యాహ్నం పెద్దపట్నా
నికి లారీ వెడుతున్నాది.

"పట్నం వెళ్ళివస్తావా?" అన్నాడు ఇంజనీరు.

"నీదగ్గరకొచ్చాను నేను" అన్నాను నేను.

"నాదగ్గరికే వచ్చేస్తావు? పట్నం వెళ్ళిచూడు. పెళ్ళిచేసిచూడు.
దూరవైతే పక్కమీదే

తిరిగొచ్చెయ్. భోంచెయ్ పడుకో. పొద్దున్నేలే.
బ్రేక్‌ఫాస్టు" అన్నాడు ఇంజనీరు. నే వెళ్లలేదు.

40 + 40 = 80 మైళ్లు. పెట్రోలుతో లారీ వెడుతున్నాది.
ముక్కుపొడుం
అక్కడ ఇంజనీర్లకీ తదితరులకీ కాఫీ పొడుం దగ్గరనుంచీ
లారీలు.
దాకా చాలా చిన్న చిన్న అవసరాలుంటాయి. చేతులో వున్నాయి
పెళ్లాం
ఒకటి వొదిలిపెట్టారు పట్నానికి. అందులో మా ఇంజనీరు
క్షణంలో పక్కమీద
తెమ్మన్నవి ఉంటాయి. రాత్రికల్లా వొచ్చేస్తాయి.
నలిగి రాలిపోతాయి. మరేంకావు. చేమంతి పువ్వులు.

ప్రోజక్టు స్థలం కొండలమధ్య సమప్రదేశం. వెదురుడొంకల కీకా
రణ్యం. ఆ ఉన్నత ప్రదేశంనుంచి ఆ గెడ్డ నీరు కాలవద్వారా మా
పొలాల మధ్యనించి ఇహ ప్రవహిస్తుంది. మా భూములన్నీ సస్యశ్యామల
మవుతాయి.

మేమదృష్టవంతులం. ఆ మాత్రం పని ప్రారంభమైంది. మిగతా
చోట్ల జరుగుతున్నాయి ప్రాజెక్టు మహాసభలు. పెట్టిస్తున్నారు సంతకాలు.
దాఖలు చేస్తున్నారు మహజర్లు.

నరుడు తలిస్తే మా కొండల్లో నల్లరాళ్లు బద్దలయ్యాయి. నాలుగు ఫర్లాంగుల కొండప్రదేశం దొల్చారు. నామిత్రుడు సగర్వంగా చూపించాడు కొండ దొల్చిన వొంద. ప్రతి మనిషికీ గర్వకారణమే. వాడి గర్వం వేరు.

ఆ కొండలో మా ఇంజనీరుగారికి వారి మిత్రులకీ పాతుదొరికింది. బంగళాలో పాతిపెట్టిన పూర్వోత్తరపు పాతు మాత్రంకాదు. నరుడు నడవని కారడివిలో పాతులు దొరుకుతాయా? రాసేశారు. చేతికొచ్చిన ఖర్చు పారేశారు. కంట్రాక్టర్లు, ఇంజనీర్లకు జీవితానికి సరిపడ్డట్టు ఇంజనీరు నింపుకున్నాడు. సంతృప్తితో చిన్ననాటి స్నేహితుడైన నాకు వివరాల్తో సహా స్వేచ్ఛగా మనసిచ్చి చెప్పేశాడు.

"నాలుగు మడి చెక్కలు దున్నుకొని బతుకుతున్నావా? పంట పోతే ప్రభుత్వం ఇచ్చే అప్పుకోసం ఎదురు చూస్తున్నావా? ఏమీ బాగులేదు. మీ ఊళ్ళ మధ్యనుంచి కాలువలు తవ్వుతాం. పెట్టే అప్లికేషను. నువ్వే కంట్రాక్టరువి. నేనున్న నాలుగు రోజుల్లో నాలుగు డబ్బులున్న వాడివి నువ్వుకావాలి" అని సాదరంగా చెప్పి నా చెవులు రెండూ సాగదీశాడు. ఎవడంటాడు ఆమాత్రం మాట? చేజిక్కిన అవకాశాన్ని పట్టుకొని కృతజ్ఞతతో సంచరించక వాజమ్మలాగ వెర్రెత్తి–దుర్భిక్షంలో అధిక మాసం, జరిమానా కట్టుకున్నాను అనే అంటున్నాది లోకం.

నిజం చెప్పొస్తే ఇంతవరకు అయిన ఖర్చుతో మా ప్రాజెక్టు సగం అయిపోయి వుండేది. కొండముచ్చుల్లాగ కొండల్లో ప్రవేశించి ఇంజనీర్లు కొల్లగొట్టేస్తున్నారు.

మా ఇంజనీరుగారికి హమేషా ఎనమండుగురు బంట్రోతులు. ఒకరు తొలికోడితో లేచి, ఎనిమిది మైళ్ల దూరంలో వున్న పల్లెకు వెళ్లి తెల్లవారకుండా పాలు తెస్తాడు. ఒక బంట్రోతు జాతిరీత్యా రజక మహాజనుడు. బట్టలు ఉతుకుతాడు. ఇస్త్రీ చేస్తాడు. ఒకడు జాతిరీత్యా మంత్రి. ఇంజనీరుగారికి పొద్దున్నే గెడ్డంగీస్తాడు. రాత్రి ఒళ్ళంతా మాలీసు చేస్తాడు. ఆ జాతులవాళ్ళు అవునాకాదా అని ఆ పనులు చేస్తారా చెయ్యరా అని తెలుసుకొనే వేసుకోబడ్డారు. ఒక కుర్రవాడు అమ్మగారి అవసరాలకు ప్రత్యేకం. ఒకడు పిల్లల నాడించడానికి ప్రత్యేకం. ప్రభుత్వ సంబంధమైన పనివా

కొక్కటి చెయ్యడంలేదు. చెయ్యనక్కరలేదు. ఒక బంట్రోతు రెండు ఫర్లాంగుల దూరంలోవున్న నూతినుంచి నీళ్ళ మోతకి ప్రత్యేకం. వీరంద రికీ ప్రభుత్వమే జీతాలిస్తున్నది. ప్రభుత్వ మేమిటి నువ్వూ నేనూ!

తక్కావీరుణం మంజూరు కాలేదు. ఆఫీసర్ల మొదలు బంట్రోతుల దాకా యావన్మందిమీదా అగ్నిహోత్రం రగుల్తున్నాది. అప్పుడే కనబడాలా ఇంజనీరు? ఎదురుగా కారు పెట్టుకొని దర్జాగా నాలుగురోడ్ల మధ్య పలుగుర్ని వెంటబెట్టుకొని తగుదునని నిలబడ్డాడు.

ఒళ్ళు తెలియక ఊరకుక్కలాగ మొరిగి రేచుకుక్కలాగ పడి జరి మానా చెల్లించుకున్నాను.

అయితేనేం? ఇప్పుడు జరుగుతున్నాది పబ్లిక్ ఎన్‌క్వయిరీ. కోర్టులో నా స్టేట్‌మెంట్ గగ్గోలు పెడుతున్నాది. బంట్రోతుల సాక్ష్యంతో ప్రారంభమైంది. మా పక్క పల్లెవాడేకదూ, పాలిస్తున్నాడు. పాలతో ప్రారంభం: